




సిలిండర్ల ప్లకార్డుల ప్రదర్శన


డీఎస్సీ బ్యానర్‌ను చూపుతున్న యువతి


పసుపు జెండాలతో..



కబ్జాలరెడ్డి కాటసాని

- ఆయన ఇల్లు కూడా కబ్జాస్థలంలో కట్టుకున్నదే
- జగన్నాథగట్టు, గజ్జలకొండలను కొల్లగొట్టాడు
- అదంతా కాటసాని గ్రావెల్ ఫీల్డ్ (కేజీఎఫ్)
- హంద్రీనీవా లిఫ్ట్ ద్వారా ఓర్వకల్లుకు సాగు, తాగునీరు
- గోరుకల్లు, అలగనూరు రిజర్వాయర్లు మరమ్మతులు
- ప్రజల జీవితాలు మార్చేలా సూపర్ సిక్స్ పథకాలు
- ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు కేటాయింపులో సామాజిక న్యాయం
- కల్లూరు చెన్నమ్మ సర్కిల్ ప్రజాగళం సభలో చంద్రబాబు









కర్నూలు, మే 6(ఆంధ్రజ్యోతి)/కల్లూరు: 'పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి భూములు కనిపిస్తే చాలు కబ్జా చేస్తాడు. ప్రశ్నిస్తే చంపుతామని బెదిరిస్తాడు. ఇక్కడే ఆయన ఇల్లు ఉంది. అది కూడా కబ్జా చేసిన స్థలంలోనే కట్టుకున్నాడు. ఈయన రాంభూపాల్‌రెడ్డి కాదు.. కబ్జాలరెడ్డి' అంటూ టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు ఘాటుగా స్పందించారు. ప్రజాగళంలో భాగంగా పాణ్యం నియోజకవర్గం కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. మిట్ట మధ్యాహ్నం 12 గంటలకు సభ జరిగింది. తమ అధినేత చంద్రబాబు కోసం మండుటెండను సైతం లెక్క చేయకుండా వెల్లువలా జనం తరలివచ్చారు. చంద్రబాబు ప్రసంగం టీడీపీ, జనసేన శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. జగన్ వైఖరి, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రశ్నించినప్పుడల్లా ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. భారీగా తరలివచ్చిన ప్రజలతో చెన్నమ్మ సర్కిల్ జన జాతరలా మారింది. ప్రజల ఉత్సాహాన్ని చూసిన టీడీపీ అధినేత చంద్రబాబు అదే ఉత్సాహంతో ప్రసంగించారు. జగన్ వైఫల్యాలు.. పాణ్యం రాంభూపాల్‌రెడ్డి అక్రమాలను ఎండగడుతూనే.. టీడీపీ అధికారంలో వస్తుందని, సూపర్ సిక్స్ పథకాలు ద్వారా పేదలను లక్షాధికారులను మారుస్తామంటూ వివరించారు. సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు.

కబ్జా స్థలంలోనే కాటసాని ఇల్లు

అదిగో అక్కడ కనిపిస్తున్న ఎమ్మెల్యే కాటసాని ఇల్లు కూడా కబ్జా స్థలంలోనే కట్టుకున్నాడు. ముజఫర్‌నగర్‌లోని సర్వే నంబరు 524లో మసీదుకు చెందిన రెండు ఎకరాల భూమిని కబ్జా చేశాడు. ఆ భూమి కోసం పోరాడిన ముస్లిం యువకుడిని చంపుతామని బెదిరించాడు ఈ కబ్జాల రెడ్డి. తమ్ముళ్లూ.. కేజీఎఫ్ సినిమా చూశారా..? ఇక్కడ కూడా ఓ కేజీఎఫ్ ఉంది. అదే కాటసాని గ్రావెల్ ఫీల్డ్ (కేజీఎఫ్) అని చంద్రబాబు నామకరణం చేశారు. జగన్నాథగట్టు, గజ్జలకొండను కొల్లగొట్టి రూ.కోట్లు విలువైన గ్రావెల్ (గరుసు) తవ్వేశాడని ఆరోపించారు. పాణికేశ్వర స్వామి భూములు కబ్జా చేసి నకిలీ పట్టాలు సృష్టించాడని, చివరికి జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాలను కూడా కాటసాని రాంభూపాల్ రెడ్డి వదల్లేదన్నారు. నాటుసారా, సెటిల్‌మెంట్లు, అన్యాయాలపై ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించిన ఈనాడు కార్యాలయంపై దాడులు చేశారన్నారు. ఈ రాక్షస పాలను అంతమొందించడానికే ఇద్దరు దుర్గామాతలు (గౌరు చరిత, బైరెడ్డి శబరి)ను ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఎంపిక చేశామని చెప్పారు. ఈ ఇద్దరిని గెలిపిస్తే కబ్జాల రెడ్డిని రాజకీయంగా భూస్థాపితం చేస్తారని చంద్రబాబు పేర్కొన్నారు.


చెన్నమ్మ సర్కిల్‌లో జన సందోహం

హంద్రీనీవా ద్వారా ఓర్వకల్లు కృష్ణా జలాలు

హంద్రీనీవా కాలువపై లిఫ్ట్ పెట్టి ఓర్వకల్లు, కల్లూరు మండలాల్లో పల్లెసీమలకు తాగు, సాగునీరు అందిస్తానని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో ఇప్పుడు రెండు రోజులకు ఒకసారి కూడా తాగునీరు రావడం లేదు. మన ప్రభుత్వం రాగానే ప్రత్యేక ప్రణాళిక అమలు చేసి రోజు తాగునీరు ఇస్తాం. అలగనూరు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయడమే కాకుండా కేసీ కాలువకు అనుసంధానం చేసి గడివేములు, బండిఆత్మకూరు, నంద్యాల మండలాల్లో 30 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తాం. ఓర్వకల్లుకు పారిశ్రామికవాడలో పరిశ్రమలు తీసుకొస్తాం.. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చంద్రబాబు యువతకు భరోసా ఇచ్చారు. 'టీడీపీ ప్రభుత్వంలోనే ఇక్కడికి పరిశ్రమలు రావాలనే ఆశయంతో ఓర్వకల్లు విమానాశ్రయం నిర్మించాను. ఆసియాలోనే అది పెద్ద సోలార్ పార్కు తీసుకొచ్చాను. అంతేగాకుండా దేశంలోనే తొలిసారిగా పంపింగ్ స్టోరేజీ విద్యుత్ ఉత్పత్తికి పాణ్యం, ఓర్వకల్లు మండలాల్లో మనమే శ్రీకారం చుట్టాం. మనం పరిశ్రమలు తీసుకొస్తే.. జగన్ వచ్చాక పరిశ్రమలు పారిపోతున్నాయి..' అని చంద్రబాబు అన్నారు. ఈ నెల 13న మీ ఓటు అస్త్రంతో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించడానికి మీరు సిద్ధమా..! అని చంద్రబాబు అనగానే ప్రజలు చేతులెత్తి బిగ్గరగా నినాదాలు చేశారు. కర్నూలు ఎంపీ టికెట్ కురవ సామాజికవర్గానికి చెందిన ఎంపీటీసీ బస్తిపాటి నాగరాజుకు ఇచ్చానని చంద్రబాబు చెప్పుకొచ్చారు. అలాగే.. మంత్రాలయం, ఆదోని సీట్లు వాల్మీకులు, ఆలూరు టికెట్ లింగాయత్‌కు, పత్తికొండ టికెట్ ఈడిగ సామాజివర్గానికి, నంద్యాల టికెట్ ముస్లిం, కర్నూలు టికెట్ ఆర్యవైశ్య సామాజికవర్గానికి ఇచ్చి సామాజిక న్యాయం పాటించామన్నారు.





చిన్నారిని ముద్దాడుతూ..


ప్రసంగిస్తున్న టీడీపీ యువనేత గౌరు జనార్ధన్ రెడ్డి


మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

కబ్జాకోరు కాటసాని : గౌరు చరిత

పాణ్యం ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి అక్రమాలు, భూ కబ్జాలపై టీడీపీ పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత మాట్లాడుతూ సెంటు స్థలం కూడా వదలడం లేదన్నారు. రూ.3 కోట్లతో పూర్తి చేసే అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులను పర్సెంటేజీల కోసం రూ.35 కోట్లకు పెంచారన్నారు. భూములే కాదు.. చెరువులను కూడా వదల్లేదన్నారు. మాజీ సైనికుల స్థలాలను సైతం కబ్జా చేసిన ఘనుడు కాటసాని అన్నారు. అదిగో అక్కడ కనిపిస్తున్న ఇంటిని కూడా కబ్జా స్థలంలోనే కట్టుకున్నాడు ఈ ఎమ్మెల్యే.. అంటూ బైరెడ్డి శబరి ఆరోపించారు. సమావేశంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్ధన్‌రెడ్డి, నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, కల్లూరు అర్బన్ టీడీపీ కన్వీనర్ పెరుగు పురుసోత్తంరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు డి.రామాంజనేయులు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేశ్‌గౌడ్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, టీడీపీ నాయకుడు ఈవీ రమణ, కల్లూరు సింగిల్ విండో మాజీ చైర్మన్ ఎస్వీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గౌరు చరిత

సమర్థవంతంగా విధులు నిర్వహించండి

- స్పెషల్ జనరల్ అబ్జర్వర్ రామ్ మోహన్ మిశ్రా
- జిల్లాలో 13,89,307 మంది ఓటర్లు

నంద్యాల (కల్చరల్), మే 6: సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి హింసాత్మక సంఘటనలకు తావివ్వకుండా బాధ్యతతో, సమర్థవంతంగా విధులు నిర్వహించాలని స్పెషల్ జనరల్ అబ్జర్వర్ రామ్ మోహన్ మిశ్రా పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో సాధారణ ఎన్నికల నిర్వహణపై జనరల్ అబ్జర్వర్లు పంకజ్ కుమార్, అన్నవి దినేష్ కుమార్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు, ఎన్నికల వ్యయ పరిశీలకులు మణికందన్, కిరణ్ తోట్టుపురం అశోకన్‌లతో కలిసి స్పెషల్ జనరల్ అబ్జర్వర్ రామ్‌మోహన్ మిశ్రా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ జనరల్ అబ్జర్వర్ రామ్‌మోహన్ మిశ్రా మాట్లాడుతూ సాధారణ ఎన్నికల పోలింగ్ శాంతియుతంగా నిర్వహించేందుకు భద్రతా పరంగా తీసుకోవలసిన చర్యలపై పలు సూచనలు చేశారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని జనరల్ అబ్జర్వర్ కలెక్టర్‌ను అభినందించారు. జిల్లాలో మొత్తం 6అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి 1711 పోలింగ్ కేంద్రాలుఉన్నాయన్నారు. వీటిలో వయో వృద్ధులు, వికలాంగులకు పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్లు, ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు. బ్రెయిలీ ఓటర్ స్లిప్పులు జిల్లాకు రానున్నాయన్నారు. వాటిని వెంటనే పంపిణీ చేస్తామన్నారు. నంద్యాల జిల్లాలో మొత్తం 13,89,307 మంది ఓటర్లు వున్నారన్నారు. వీరిలో పురుషులు 6,80,402 మంది, స్త్రీలు 7,08,647 మంది, ఇతరులు 258 మంది ఉన్నారన్నారు. ఎస్పీతో కలిసి పరిశీలిన చేసి వల్నరబుల్ పోలింగ్ కేంద్రాలను, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. 1568 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.


సమావేశమైన అబ్జర్వర్లు, కలెక్టర్, ఎన్నికల వ్యయ పరిశీలకులు, స్పెషల్ అబ్జర్వర్లు

అత్తను హత్య చేసిన అల్లుడు

పాణ్యం, మే 6 : స్థానిక అయ్యపురెడ్డి కాలనీకి చెందిన చల్లా లక్ష్మీదేవి (48) ని ఆమె అల్లుడు తలారి శ్రీనివాసులు హత్య చేశాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. డోన్‌కు చెందిన శ్రీనివాసులుకు 11 సంవత్సరాల క్రితం పాణ్యంకు చెందిన లక్ష్మీదేవి కూతురు రాజ్యలక్ష్మితో వివాహమైంది. శ్రీనివాసులు నిత్యం మద్యం సేవించి రాజ్యలక్ష్మిని వేధిస్తుండేవాడు. దీంతో ఆమె కొద్ది కాలంగా పుట్టింట్లో ఉంటోంది. సంసారానికి రావాలని పాణ్యం వచ్చినప్పుడల్లా శ్రీనివాసులు గొడవ పెట్టుకునేవాడు. ఈ నెల 5వ తేదీ రాత్రి ఈ విషయంలో భార్యతో, అత్తతో గొడవకు ఘర్షణకు దిగాడు. కాపురానికి భార్య రాకపోవడానికి కారణం అత్తనే అని కోపంతో ఆమె తలపై కర్రతో కొట్టి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీదేవిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. మృతురాలి కుమారుడు సురేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పాణ్యం సీఐ నల్లప్ప తెలిపారు.

అలగనూరు గండిని పూడ్చలేకపోయారు

కోవెలకుంట్ల, మే 6: అలగనూరు కట్ట కుంగిపోయినా కనీస మరమ్మతు కూడా చేయలేని అసమర్థ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం కోవెలకుంట్ల మండలంలోని గుల్లదుర్తి, బిజనవేముల, బనగానపల్లె మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామాల్లో ఆయన ప్రజాగళం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా


కోవెలకుంట్ల మండలం గుల్లదుర్తిలో మాట్లాడుతున్న బీసీ జనార్దన్‌రెడ్డి

ఎమ్మెల్యే కాటసానిపై బీసీ ఫైర్

బిజినవేములలో ఎమ్మెల్యే రామిరెడ్డిపై బీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. జోలదరాసి వద్ద రిజర్వాయర్ నిర్మించకుండా తుంగలో తొక్కిన అసమర్థుడు కాటసాని అని విమర్శించారు. రైతుల పొలాలను తాకట్టు పెట్టేందుకే సీఎం జగన్ ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని తీసుకొచ్చాడని ఆరోపించారు. బిజవేముల గ్రామంలో ఆర్వో ప్లాంట్‌ను మూయించి రెండేళ్లుగా వైసీపీ నాయకులు ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ప్లాంట్‌ను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, అమడాల మద్దిలేటి, పరమేశ్వరరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గోవర్దన్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, భక్తప్రహ్లాదరెడ్డి, హుసేనయ్య, మనోహర్, రాధాకృష్ణమూర్తి, ధనుంజయుడు తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజే గందరగోళం..!

● అస్తవ్యస్తంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



బనగానపల్లెలో క్యూలో నిలబడి ఓట్లు వేస్తున్న ఉద్యోగులు

నంద్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): మొదటి రోజే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ తీవ్ర గందరగోళం మధ్య ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 17939 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా తొలి రోజు 5511 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. 32 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి అధికారులు చాల చోట్ల సరైన చర్యలు తీసుకోకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బ్యాలెట్ పేపర్లకు సంబంధించిన కవర్లు కూడా అందుబాటులో ఉంచని పరిస్థితి కొన్ని చోట్ల కనిపించింది. ఇక పీవో, ఏపీవోలకు శిక్షణ పేరిట చాలా చోట్ల ఓటింగ్ చాలా ఆలస్యంగా ప్రారంభమైంది. ఇక కొన్ని చోట్ల బ్యాలెట్‌ను వినియోగించుకునే వారికి తమ ఫెసిలిటేషన్ సెంటరు ఎక్కడ అన్నది సమాచారం ఇవ్వకపోవడంతో ఓటింగ్‌ను వినియోగించుకోలేకపోయారు. ఇక ఇతర జిల్లాల నుంచి విధుల నిమిత్తం వచ్చిన వారి పేర్లు కనిపించకపోవడంతో వారంతా ఓట్లను వేయలేకపోయారు. తాము ఓట్లు వేసే ప్రదేశానికి ఇతరులు రావడంపైన ఉద్యోగ, ఉపాధ్యాయులు విస్మయం వ్యక్తం చేశారు. అధికారుల ఉదాసీనతపై ఆత్మకూరు సెంటర్‌లో ఓటేసేందుకు వచ్చిన పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు తీవ్ర నిరసన తెలిపారు.



ఆత్మకూరులో రిటర్నింగ్ ఆఫీసర్‌ను ప్రశ్నిస్తున్న ఉద్యోగులు

● ఫెసిలిటేషన్ సెంటర్‌పైన సరైన సమాచారం లేదు..

పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు సంబంధించి ఫెసిలిటేషన్ సెంటర్ల సమాచారంపై అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. శ్రీశైలం నియోజకవర్గానికి సంబంధించి ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆత్మకూరులోని బాలుర పాఠశాలలో ఏర్పాటు చేశారు. అయితే సమాచారం మాత్రం శ్రీశైలంలోని బాలుర పాఠశాల అని ఇచ్చారు. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. ఇక బనగానపల్లె నియోజకవర్గంలో పాణ్యం, గడివేముల ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌పైన కూడా సరైన సమాచారం లేకపోవడంతో ఆ మండలాల ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. ఓటు వేసే ముందు డిక్లరేషన్ ఫారంపై గజిటెడ్ ఆఫీసర్ల అటెస్టేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. అధికార పార్టీ ప్రలోభాలకు తెరతీసింది. పోస్టల్ ఓట్లను కొనేందుకు ఒక్కొక్కరికి రూ.3 వేలు ఇచ్చే ప్రయత్నం చేసిందన్న ఆరోపణలు వినిపించాయి. చాలా మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈ డబ్బులను తీసుకోకుండా తమ ఓటును అధికార పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసినట్లు తెలుస్తోంది.



నందికొట్కూరు పోలింగ్ కేంద్రం వద్దగుంపులుగా ఓటర్లు

ఇద్దరి ఉద్దండుల నంద్యాల



నీలం సంజీవరెడ్డి





పీవీ నరసింహారావు



పి వెంకటసుబ్బయ్య



ఎస్పీవై రెడ్డి

- నంద్యాల, (ఆంధ్రజ్యోతి)

నంద్యాల లోక్‌సభ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడి నుంచి ఎన్నికైన నీలం సంజీవరెడ్డి ఆ తర్వాత రాష్ట్రపతి పీఠాన్ని అధిష్టించగా, పీవీ నరసింహారావు ప్రధానమంత్రి స్థానంలో దేశ రాజకీయాలను మలుపు తిప్పారు. పెండేకంటి వెంకటసుబ్బయ్య ఏకంగా ఆరు సార్లు ఎంపీగా గెలుపొందారు. 1977 ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఓటర్లంతా ఇందిరాగాంధీ వైపు మొగ్గు చూపితే, నంద్యాల ఓటర్లు మాత్రం కాంగ్రెస్ పార్టీని కాదని, జనతా పార్టీ అభ్యర్థి నీలం సంజీవరెడ్డిని గెలిపించారు.



మొదటి తెలుగు రాష్ట్రపతిని అందించిన నంద్యాల లోక్‌సభ ● ఇక్కడి నుంచే తొలి తెలుగు ప్రధాని పీవీ ఎన్నిక

నియోజకవర్గం ఏర్పాటు ఇలా..

నంద్యాల నియోజకవర్గంలో నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, శ్రీశైలం, బనగానపల్లె, డోన్, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. మొదటి సారిగా నంద్యాల లోక్‌సభ నియోకవర్గం 1952లో ఏర్పడింది. అనంతరం పలు కారణాల వల్ల 1957 ఎన్నికల సమయానికి నంద్యాల నియోజకవర్గాన్ని రద్దు చేశారు. నంద్యాలలోని ప్రాంతాలను కర్నూలు, మార్కాపురం నియోజకవర్గాల్లో కలపడంతోపాటు, అదే సమయంలో కొత్తగా ఆదోని నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. 1967 సంవత్సరం ఎన్నికల నాటికి తిరిగి నంద్యాల ప్రత్యేక లోక్‌సభ నియోజకవర్గంగా అవతరించింది. అప్పట్లో ప్రకాశం జిల్లాలోని గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గం నంద్యాల లోక్‌సభ నియోజకవర్గంలో భాగంగా ఉండేది. 2007 లోక్‌సభ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా గిద్దలూరు నియోజకవర్గాన్ని తిరిగి ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గంలో కలిపారు. 2009 ఎన్నికల నుంచి ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలతోనే నంద్యాల లోక్‌సభ నియోజకవర్గం కొనసాగుతోంది. ఇప్పటి వరకు 17 సార్లు పార్లమెంటు ఎన్నికలు జరగ్గా నంద్యాల లోక్‌సభ స్థానానికి 20 సార్ల ఎన్నికలు జరిగాయి. ఇందులో 1978, 1991, 1996 మూడు సార్లు ఉప ఎన్నికలు కావడం గమనార్హం.

● మహామహులు..

నంద్యాల నియోజకవర్గానికి మొదటిసారి 1952లో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మొదటి పార్లమెంటు సభ్యుడిగా స్వతంత్ర అభ్యర్థి రాయసం శేషగిరిరావు గెలుపొందారు. ఆ తర్వాత పెండేకంటి వెంకటసుబ్బయ్య వరుసగా నాలుగు సార్లు గెలవడమే కాకుండా, ఆ తర్వాత మరో రెండు సార్లు ఎంపీగా గెలుపొంది సిల్వర్‌జూబ్లీ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారు. ఇక్కడి నుంచి రాజకీయం మొదలుపెట్టిన ఆయన ఆ తర్వాత కేంద్రమంత్రిగా, కర్ణాటక, ఒడిస్సా రాష్ట్రాలకు గవర్నరుగా ఉన్నత పదవులు చేపట్టారు. ఇక నంద్యాల నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో ముఖ్యంగా 1977 ఎన్నికలు రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్త సంచలనం సృష్టించాయి. 1975లో ఎమర్జెన్సీ తర్వాత ఇందిరాగాంధీ 1977 ఎన్నికలకు వెళ్లింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 42 ఎంపీ స్థానాలుండగా 41 స్థానాల్లో ఇందిరాగాంధీ కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. కానీ నంద్యాలలో మాత్రం జనతా పార్టీ తరఫున పోటీ చేసిన నీలం సంజీవరెడ్డి ఇందిరాగాంధీ నిలబెట్టిన కాంగ్రెస్ అభ్యర్థిని 35743 ఓట్లతో ఓడించి, ఇందిరాగాంధీకి చెమటలు పట్టించాడు. నీలం సంజీవరెడ్డిని గెలిపించేందుకు నంద్యాల నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల నుంచి ఎద్దుల బళ్లు కట్టుకుని మరీ పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లి ఓట్లు వేసిన సంఘటనను జిల్లాకు చెందిన పలువురు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. ఆ తర్వాత భారత రాష్ట్రపతిగా ఉన్న ఫక్రుద్దీన్ అలీ మరణించడంతో సంజీవరెడ్డి రాష్ట్రపతిగా పోటీ చేసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక్కడ విశేషమేమిటంటే.. 1969లో రాష్ట్రపతిగా కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన సంజీవరెడ్డిని కాకుండా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన వీవీ గిరికి లోపాయికారిగా మద్దతు తెలిపిన ఇందిరా గాంధీ, 1977లో విపక్షంలో ఉన్నా కూడా నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతి పీఠాన్ని అధిరోహించేందుకు మద్దతు తెలిపారు.

● పీవీ లీవిగా..

నంద్యాల లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి మరో ముఖ్యమైన ఘట్టం 1991 ఎన్నికలు. రాజీవ్‌గాంధీ హత్య తర్వాత దిశానిర్దేశం లేకుండా సాగుతున్న కాంగ్రెస్ పగ్గాలను పీవీ (పాములపర్తి వెంకట) నరసింహారావు చేపట్టారు. మైనారిటీ ప్రభుత్వాన్ని నడిపేంచిందుకు సమర్థవంతమైన నాయకుడు లేని సమయంలో కాంగ్రెస్ నాయకులు అంతా కలిసి తీర్మానించడంతో పీవీ ప్రధానమంత్రి పదవిని చేబట్టారు. ఆ తర్వాత ఏదో నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలవాల్సి ఉండటంతో, ఆయన నంద్యాల లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో అప్పటి సిటింగ్ ఎంపీ అయిన గంగుల ప్రతాప్‌రెడ్డి రాజీనామా చేసి, పీవీని పోటీకి ఆహ్వానించారు. సాటి తెలుగువాడి ప్రధాని పీఠానికి సంబంధించిన విషయం అనే గౌరవంతో అప్పటి టీడీపీ నేత ఎన్టీఆర్ పీవీపై పోటీకి ఎవరినీ నిలబెట్టలేదు. ఈ ఎన్నికల్లో పీవీ నరసింహారావు బీజేపీ అభ్యర్థి బంగారు లక్షణ్‌పై 580035 భారీ మెజారిటీతో గెలుపొంది రికార్డు సృష్టించారు. ఆ తర్వాత ఐదేళ్ళు ప్రధానిగా కొనసాగి దేశాన్ని సంస్కరణల మార్గం పట్టించారు.

● అపర దానకర్ణుడిగా పేరు పొందిన నంది పైపుల అధినేత ఎస్పీవై రెడ్డి 2004 నుంచి 2014 వరకు మూడుసార్లు వరుసగా ఎంపీగా ఎన్నికయ్యారు.

బటన్ నొక్కితే సొమ్ములు నేరుగా మీ ఖాతాల్లోకి పడిపోతున్నాయి...ఇది జగన్ మాట.. నమ్మొద్దు.. అంతా మోసం ఒక్క రూపాయి పడలేదు...ఇది లబ్ధిదారుల మాట... సీఎం హోదాలో జగన్ ఎక్కడికి వెళ్లి సభపెట్టినా, నోటిఫికేషన్ వచ్చిన తర్వాత జరిగిన సిద్ధం సభలు, ప్రస్తుతం జరుగుతున్న ప్రచార సభల్లో చెప్పే మాట ఒక్కటే... దేశంలో ఎక్కడా లేని విధంగా కోట్లాది రూపాయలను బటన్ నొక్కి, నేరుగా మీ ఖాతాల్లో వేస్తున్నామని... వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రోజులు గడిచిపోయాయి. నెలలు దాటుతున్నాయి. ఈ ఏడాది బటన్ నొక్కినా నిధులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. ఈ ఏడాది జనవరి 1 నుంచి మార్చి 18న ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకూ తొమ్మిది పథకాలకు జగన్ బటన్‌లు నొక్కారు. ఇందులో ఐదు పథకాలకు సంబంధించి నేటి వరకూ ఒక్క రూపాయి కూడా లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాలేదు. ఆసరా నిధులు 50 శాతం మందికి మాత్రమే పడ్డాయి. సీఎం జగన్ నొక్కి మీ ఖాతాలకు సొమ్ములు వేశామని చెప్పడంతో రెండు నెలలుగా లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అసలు సొమ్ములు విడుదల చేస్తే కదా పడేది అంటూ కొందరు బ్యాంకర్లు సమాధానమిస్తున్నారు. ప్రచారంలో భాగంగా అధికార పార్టీ నాయకులు తాము వివిధ పథకాల కింద సొమ్ములు వేశామని చెబుతుంటే ఖంగుతినడం లబ్ధిదారుల వంతవుతోంది. పలు చోట్ల వైసీపీ నేతలను ప్రజలు ఇదే విషయంపై నిలదీస్తున్నారు.

- ఐదు పథకాలకు ఒక్క రూపాయి జమ కాలేదు
- ఖాతాల్లో డబ్బులు వేశామంటూ ఆర్భాటం
- ప్రతి సభలోనూ జగన్ ప్రగల్భాలు
- నెలలు గడుస్తున్నా ఎదురుచూపులే
- బ్యాంకులు చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణ

ఉత్తుత్తి నొక్కుడే..!

నందికొట్కూరు, మే 6:

● ఆసరాకు ...102 రోజులు

డ్వాక్రా సంఘాలు 2019 ఏప్రిల్ నాటికి తీసుకున్న రుణాన్ని మాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మడతేశారు. దాన్ని నాలుగు విడతల్లో తీరుస్తామంటూ ప్రకటించి ఏటా కొంత మొత్తంలో నిధులను విడుదల చేయడం ఆరంభించారు. నాలుగో విడతగా నిధులను జనవరి 23న జగన్ విడుదల చేశారు. నంద్యాల జిల్లాలో 26,012 గ్రూపులకు రూ.167.41 కోట్లు, కర్నూలు జిల్లాలో 25,705 గ్రూపులకు రూ.142.36 కోట్లను బటన్ నొక్కి విడుదల చేసినట్లు ప్రకటించారు. ఈ మేరకు వైసీపీ నాయకులు సమావేశాలు పెట్టి మహిళలను భారీగా తరలించి ప్రచారం చేశారు. నమూనా చెక్కులు అందించారు. దీనికి 50 శాతం లబ్ధిదారులకు సొమ్ములు పడలేదు. ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా మాత్రమే నిధులు రావడంతో ఆయా వర్గాలకే సొమ్ములు పడినట్లు చెబుతున్నారు. మిగిలిన వారికి 100 రోజులు దాటినా సొమ్ములు రాలేదు.

● అన్నదాతకు పరిహారం కూడా అంతే..

కరువు జిల్లాగా ప్రకటించినా రైతులకు అదే సీజన్ ముగిసేలోగా పంట నష్టపరిహారం(ఇన్‌పుట్ సబ్సిడీ) అందిస్తామని జగన్ ప్రగల్భాలు పలికారు. కరవు కారణంగా నష్టపోయిన వారికి పరిహారం ఎగ్గొట్టారు. ఈబీసీ నేస్తం ద్వారా అగ్రవర్ణాల పేదలకు ఏటా రూ.15 వేలు అందించే పథకం కింద సీఎం జగన్ మార్చి 14న బటన్ నొక్కి నిధులు విడుదల చేశారు. కర్నూలు జిల్లాలో 6,944 మందికి రూ.10.41 కోట్లు, నంద్యాల జిల్లాలో 17,652 మందికి రూ.26 కోట్లు వారి ఖాతాలకు జమ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటి వరకూ ఖాతాలకు సొమ్ములు చేరలేదు. బటన్ నొక్కి 50 రోజులు దాటినా నేటికీ అదే పరిస్థితి.



● ప్రచార ఆర్భాటమే:

వివిధ పథకాల కింద బటన్ నొక్కి నిధులు విడుదల ప్రచార ఆర్భాటం కోసం తప్ప ఆయా వర్గాలకు లబ్ధి చేకూర్చాలన్నది జగన్ లక్ష్యం కాదని పలువురు విమర్శిస్తున్నారు. నిధుల విడుదలను ఎన్నికల తేదీ ముందు వరకూ నిలిపివేసి రెండు, మూడు రోజులు ముందుగా విడుదల చేసి రాజకీయంగా లబ్ధి పొందాలన్నది జగన్ ఆలోచనగా చెబుతున్నారు. ఇలా చేయడం ఎన్నికల నియమావళికి విరుద్ధమని తెలిసినా అదే మార్గాన్ని ఎంచుకున్నారు. ఒక వేళ ఎవరైనా అందుకు అభ్యంతరం తెలిపితే నెపాన్ని ప్రతిపక్షాలపైకి నెట్టి వేయాలని వైసీపీ నేతలు భావిస్తున్నట్లు చెబుతున్నారు. బటన్ నొక్కి నిధులు విడుదల చేశామని చెప్పి ఆయా పథకాల లబ్ధిదారులను జగన్ బ్యాంకుల చుట్టూ తిరిగేలా చేస్తున్నారు.

దారుణం.. ఏడు నెలలైంది?

బ్యాంకులు, సహకార సంఘాల నుంచి రూ.లక్ష లోపు వ్యవసాయ స్వల్పకాలిక ంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రుణాలను వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తే వడ్డీ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లిస్తోంది. ఏటా అక్టోబరులో ఈ నిధులు విడుదల చేసేవారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న బటన్ నొక్కి విడుదల చేశారు. ఐదు నెలలు ఆలస్యంగా నిధులు విడుదల చేసినా లబ్ధిదారులకు అందలేదు. వడ్డీ రాయితీ నంద్యాల జిల్లాలో 2,34,151 .మంది రైతులకు రూ.47.06 కోట్లు, కర్నూలు జిల్లాలో 2,96,973 మంది రైతులకు రూ.59.67 కోట్లు సీఎం జగన్ బటన్ నొక్కి విడుదల చేశారు. రెండు నెలలు దాటినా ఒక్కరికి రూపాయి పడలేదు.

● జగనన్న విద్యా దీవెన ఏదీ....?

వృత్తి విద్యా కోర్సులు, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన ద్వారా ప్రభుత్వం ఫీజుల సొమ్మును వాయిదా రూపంలో వారి తల్లుల ఖాతాలకు జమ చేస్తోంది. ఈ ఏడాది మొదటి విడతగా మార్చి 1న నంద్యాల జిల్లాలో 33,481 మంది విద్యార్థులకు సంబంధించి 30,136 మంది తల్లుల ఖాతాలకు రూ.24.44 కోట్లు, కర్నూలు జిల్లాలో 35,618 మంది విద్యార్థులకు సంబంధించి 32,250 మంది తల్లుల ఖాతాలకు రూ.23.59 కోట్లను సీఎం జగన్ బటన్ నొక్కి తల్లుల ఖాతాలకు మళ్లించినట్లు చెప్పారు. ఆ సొమ్ములు తల్లుల ఖాతాలకు చేరలేదు. దీంతో ఎక్కడికక్కడ విద్యా సంస్థలు ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్న పరిస్థితి నెలకొంది. రెండు నెలలు దాటినా ఇంకా సొమ్ములు పడలేదు.

● కాలేజీ ఫీజు మేమే కట్టుకున్నాం



నేను బీటెక్ థర్డ్ ఇయర్. కర్నూలు పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నా. విద్యాదీవెన పథకం కిందరావల్సిన నగదు మాకు రాలేదు. ఫీజు చెల్లించాలని కళాశాల నుంచి ఎక్కువగా ఒత్తిడి వస్తే చేతి నుంచి కట్టుకున్నాం.

- బి.ముఖేష్, పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల, మిడ్తూరు

● ఆసరా డబ్బులు రాలేదు



ఆసరా నాలుగో విడత డబ్బులు ఇంత వరకు బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. అవసరానికి వస్తుందనుకున్న డబ్బు చేతికి రాకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. ఫిబ్రవరి 28న మీ అకౌంట్లలో డబ్బులు జమ అవుతాయని చెప్పారు. ఇప్పటి వరకు కాలేదు. కాని ఎప్పుడు పడతాయో తెలియక పదేపదే బ్యాంకు వెళ్లి అకౌంట్‌లో చెక్ చేసుకుంటున్నాం. దాదాపు 102 రోజుల నుంచి ఆసరా డబ్బుల కోసం ఎదురు చూస్తున్నాం.

- బసిరున్ బీ, మిడ్తూరు



లక్ష్మాపురంలో చికెన్ షాపులో పని చేస్తున్న నిరుద్యోగి బలరాం

పీజీ చవివినా ఉద్యోగం లేదు..

పగిడ్యాల, మే 6: మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలోని బుడగ జంగాల బలరాంను తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి పీజీ (ఎంపీఈడీ) వరకు పూర్తి చేయించారు. వైసీపీ గత ఎన్నికల సమయంలో ప్రతి ఏటా జాబ్ క్యాలెండరు విడుదల చేస్తామని ప్రకటించడంతో తమకు ఉద్యోగం వస్తుందని బలరాం ఆశించాడు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎలాంటి నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో చివరకు నిరాశే మిగిలింది. దీనికితోడు ఉపాధి కరువై కుంటుబ పోషణ భారంగా మారింది. వృద్ధులైన తల్లిదండ్రులను వదిలిపెట్టి పట్టణాలకు వెళ్లి ప్రైవేట్ ఉద్యోగం చేయలేని పరిస్థితి. దీంతో గ్రామంలోనే చికెన్ షాపు, హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

మంచి పార్టీకే ఓటు వెయ్యాలి

● **లచ్చక్క :** ఏమే రామక్కా. పొద్దుగాలే పొయ్యికాడ కూచ్చోని ఎవర్నో రుస రుస లాడుతున్నావ్ ..

● **రామక్క :** ఇంకెవరు మా ఇంటోడే . పని పాట లేకుండా ఆ పార్టీ, ఈ పార్టీ అంటూ తిరుగుతాండు తాగుబోతు సచ్చినోడు ..

● **లచ్చక్క :** పార్టీవోళ్లు లెక్కలిస్తారుగదే అందుకే వాళ్లమ్మడి పోతుంటాడు ..

● **రామక్క :** ఏం లెక్కలిస్తారక్కా కష్టం చేసుకుంటే నాలుగు దుడ్లు మిగులుతాయి వాళ్లిచ్చే లెక్కలు తాగనీకీ, తిన్నీకీ తప్ప ఎందుకు పనికొస్తాయ్ ..

● **లచ్చక్క :** అవునే రామక్కా మా ఇంటోడు గంతే. ఆ పార్టీలోళ్లు వాళ్ల పబ్బం గడుపుకోడానికి వీరికి తాపుతారు, తినిపిస్తారు. ఓట్లు అయిపోంగానే వీళ్లనెవ్వరూ పట్టించుకోరు.

● **రామక్క :** అంతేగా వాళ్ల ప్రచారాల్లో మాత్రం సారా లేకుండా చేస్తాం. మందు లేకుండా చేస్తాం అంటారు .. ఆ మందే పోసి వాళ్లమ్మడి తిప్పుకొని, వీళ్లనంతా ఎర్రోళ్లను చేస్తారు.

● **లచ్చక్క :** ఎన్నిసార్లు మోసపోతారో ఏమో .. ఈ తాగుబోతు సచ్చినోళ్లకు తెలివి వచ్చేదెప్పుడు నాయకుల ఆట కట్టించేదెప్పుడు ..?

● **రామక్క :** ఏమైనా సరే ఈసారి మనమంతా ఆలోసించి, మంచి పార్టీకే ఓటు వేయాలక్కా ..

● **లచ్చక్క :** అట్టాగే చేద్దాంలేయే. పొయ్యొచ్చా. పొయ్యి మీద పప్పు పెట్టొచ్చా ..

ఓటరు వాయిస్

నిజాయితీగా ఓటు వేశా



ఉయ్యాలవాడ, మే 6 : ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు పదిసార్లు ఓటు హక్కు వినియోగించుకున్నా. ఇప్పటిలాగా గతంలో ఓటుకు డబ్బులు ఇచ్చేవారు కాదు. పది సార్లు ఓటు వేసినా ఒక్కసారి కూడా డబ్బులు తీసుకోలేదు. డబ్బులు ఇవ్వడానికి వచ్చినా తిరస్కరించే వాడిని. ఓటును నిజాయితీగా వేస్తున్నా. గ్రామంలో అభివృద్ధి చేసిన పార్టీ నాయకులకే ఓటు వేస్తాను. గ్రామం అభివృద్ధి చెందాలన్నదే నా ఆశయం.

- నల్లబోయిన మహేశ్, ఆర్.పాంపల్లె గ్రామస్తుడు

అభివృద్ధికే ఓటు



రుద్రవరం, మే 6 : ఏపీ అభివృద్ధికి ఓటు వేస్తాం. దేశంలో ఏపీ రాజధాని ఏదంటే చెప్పుకోవడానికి ఏమీ లేదు. ఉన్న అమరావతిని అభివృద్ధి చెందనీయకుండా చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించి అభివృద్ధి చేసిన వారికే ఓటు వేస్తాం.

- నవీన్, తొలిఓటరు, కోటకొండ

నిర్భయంగా ఓటు వేస్తా



నిర్భయంగా అభివృద్ధి ఎవరు చేస్తారో ఆ అభ్యర్థికి ఓటు వేస్తా. తొలిసారి ఓటు హక్కు వచ్చింది. ఓటుతో మంచి పరిపాలనను ఎన్నుకునే అవకాశం ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కల్పించింది. ఆలోచించి ఓటు వేస్తే అభివృద్ధికి బాట వేసినట్లే.

- అబ్దుల్‌నబీ, రుద్రవరం

అభివృద్ధికి ఓటు వేస్తా



అభివృద్ధి చేసే వారికి ఓటు వేస్తా. యువకులకు ఉపాధి కల్పిస్తానన్న వారినే ఎన్నుకోవాలి. ఐదేళ్లలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కరువయ్యాయి. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది.

- తరుణ్, యువకుడు, యల్లావత్తుల, రుద్రవరం మండలం

తొలిసారి ఓటు



నాకు తొలిసారి ఓటు వేసే అవకాశం వచ్చింది. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో వజ్రాయుధంలాంటిది. ప్రలోభాలకు గురి కాకుండా అభివృద్ధి చేసే వారికి ఓటు వేస్తాం. ఒక్కసారి ఓటు వేస్తే ఆ అభ్యర్థిని ఐదేళ్ల పాటు భరించాల్సి ఉంటుంది. ఆలోచించి ఓటు వేస్తా.

- పోలా సురేష్ - రుద్రవరం

సీనియర్ సిటిజన్...

గతంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు కాస్త భయంగా ఉండేది. ప్రస్తుతం వృద్ధులమైనా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ముందుకు అడుగు వేస్తున్నాం. వృద్ధుల మాటలు ఇలా..

అప్పట్లో బొరుగులు పంచారు



అప్పట్లో ఓటు ఉన్న కుటుంబాలకు బొరుగులు, పప్పులు పంచారు. ఇప్పటి రాజకీయ నాయకులు నోట్లు పంచి ఓటు అడుగుతున్నారు. ఓటుకు నోటు తీసుకోకపోతే మాకు వేయరనేది వారి అభిప్రాయం. డబ్బు తీసుకుంటేనే వారికి నమ్మకం కలుగుతుంది. తిరస్కరిస్తే ఏం చేసేస్తారో అన్న భయం. 85 ఏళ్లలో మరోసారి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నా.

- మాబు, ఆలమూరు, రుద్రవరం మండలం

అప్పట్లో ఇంత ఆర్భాటం లేదు



అప్పట్లో ఓటు కోసం ఇంత ఆర్భాటం లేదు. ఇప్పుడు హడావుడి, ఆర్భాటాలు ఎక్కువ. అప్పట్లో మాట ఇచ్చిన ప్రకారం సమస్యలు పరిష్కరించే వారు. ప్రస్తుతం ఓటు వేయించుకుని మాత్రమే వెళుతున్నారు.

- నడిపి హుసేని, ఆలమూరు, రుద్రవరం మండలం

మాటకు కట్టుబడి



మాటకు కట్టుబడి అప్పట్లో ఓటు వేశాం. అప్పట్లో బొరుగులు, బుడ్డల నూనె పంచేవారు. టిఫిన్ చేసుకుని తిని పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేశాం. ప్రస్తుతం ఓటుకు విలువ కడుతున్నారు. ఓటు నిర్భయంగా వేసినప్పుడే సమస్యపై ప్రశ్నించగలం.

- అల్లాబకాష్, ఆలమూరు, రుద్రవరం

అభివృద్ధికే ఓటు వేస్తా



రాష్ట్రం, ఆళ్లగడ్డ నియోజకవర్గం అభివృద్ధి చేసే వారికే ఓటు వేస్తా. ప్రలోభాలకు లొంగి ఓటు వేయను. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం వజ్రాయుధంలాంటి ఓటు హక్కు కల్పించింది. నిర్భయంగా ఓటు వేసి అభివృద్ధిపై ప్రశ్నిస్తా.


- గుట్టకొండ రవికుమార్, దివ్యాంగుడు, ఆలమూరు, రుద్రవరం మండలం



ఆలూరు పీఠం దక్కేదెవరికి..?

బిగ్ ఫైట్

- వీరభద్రగౌడ్, విరుపాక్షిల మధ్య పోటాపోటీ
- చాప కింద నీరులా విస్తరిస్తున్న టీడీపీ



ఆలూరు, మే 6: ఆలూరు నియోజకవర్గంలో ఈసారి ఎవరు గెలుస్తారో.. అనే చర్చ జోరుగా సాగుతోంది. టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్, వైసీపీ అభ్యర్థి విరుపాక్షి పోటీలో ఉన్నారు. వీరిద్దరి మధ్య పోటాపోటీ నెలకొంది. ఆలూరు నియోజకవర్గంలో 1955లో ఏర్పడింది. అప్పటి నుంచి 15 సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో 1987, 1994లో ఆలూరులో టీడీపీ జెండా ఎగిరింది. మూడు సార్లు మసాలా ఈరన్న ఎమ్మెల్యేగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేశారు. గుమ్మనూరు జయరామ్ రెండుసార్లు ఎమ్మెల్యేగా, జగన్ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు. అంతకు ముందు మారెప్ప ఓసారి ఎమ్మెల్యేగా గెలిచి వైఎస్ రాజశేఖర్ రెడ్డి క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు.

● ఆలూరులో టీడీపీకి బలమైన క్యాడర్...

ఆలూరు నియోజకవర్గంలో టీడీపీకి బలమైన క్యాండర్ ఉంది. రెండు సార్లు ఆలూరులో టీడీపీ జెండా ఎగరవేసింది. ఆ తర్వాత గ్రూపుల వల్ల టీడీపీ ఓటమి పాలవుతోంది. గత ప్రభుత్వాలు మాత్రం నియోజకవర్గాన్ని పట్టించుకోలేదు. 2014లో టీడీపీ అభ్యర్థిగా వీరభద్ర గౌడ్ పోటీ చేసి 1919 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీరభద్ర గౌడ్ ఆలూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వేదవతి ప్రాజెక్టును పట్టుబట్టి మంజూరు చేయించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు అధిక స్థానాల్లో గెలుపొందుతున్నారు. ఈసారి ఎలాగైనా సరే టీడీపీను గెలిపించుకోవాలని టీడీపీ క్యాడర్ మొత్తం ఒక తాటిపైకి వచ్చి వీరభద్ర గౌడ్ గెలుపు కోసం విశ్వప్రయత్నాలు చేస్తోంది.

వీరభద్ర గౌడ్ రెండోసారి ఎన్నికల బరిలో నిలవగా వైసీపీ అభ్యర్థి విరుపాక్షి మొదటిసారిగా ఎన్నికల బరిలో ఉన్నారు. ఎన్నికల్లో నీవా... నేనా.. అంటూ పోటాపోటీగా గెలుపు ప్రచారాలు జోరుగా సాగిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఆరకట్ల నవీన్ కిషోర్ కాంగ్రెస్ బరిలో నిలిచారు. ఆలూరు గడ్డను తమ అడ్డాగా మార్చుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

● నియోజకవర్గ స్వరూపం...

నియోజకవర్గంలో ఆలూరు, అస్పరి, హాలహర్వి, హొలగుంద, చిప్పగిరి, దేవనకొండ, మండలాలు ఉన్నాయి

పోలింగ్ కేంద్రాలు	:294
మొత్తం ఓటర్లు	: 2,58,997
పురుషులు	: 1,30,083
మహిళలు	: 1,28,861
థర్డ్ జెండర్స్	: 53

గౌడ్ బలాలు..

వీరభద్ర గౌడ్ 2014లో టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన తర్వాత ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారు. తన తండ్రి ముద్దు బసన్న గౌడ్ పార్టీ ఆరంభం నుంచి పని చేశారు. అన్ని గ్రామాల్లో గౌడ్ సుపరిచితుడే.. తన సోదరుడు కుమార్ గౌడ్ కూడా నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేశారు.

బలహీనతలు..

కూటమి పార్టీలను కలుపుకోకపోవడం, పార్టీలో సీనియర్లను పట్టించుకోకపోవడం.

విరుపాక్షి బలాలు..

వాల్మీకి ఓటర్లు అధికంగా ఉన్నారనే ధీమా.. డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నాడనే ప్రచారం సాగుతోంది.

బలహీనతలు..

- మొదటిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేయడం..
- సొంత సామాజిక వర్గాన్ని నమ్ముకోవడం.. లీడర్లను చూసి గెలుస్తాననే ధీమాలో ఉండటం..

మహిళలతో బీవీ మాటామంతి..



ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ఎన్నికల ప్రచారపర్వంలో ముందున్నారు. అందరికంటే భిన్నంగా ఆలోచించే ఆయన ప్రచారంలోనూ అదే ఒరవడిని కొనసాగిస్తున్నారు. స్టేజీపైన కూర్చోకుండా... నేలపై మహిళలతో కలిసి సమావేశంలో పాల్గొంటూ ఓటర్లతో మమేకమవుతున్నారు. సోమవారం ఎమ్మిగనూరులో స్థానిక సమస్యలపై జరిగిన ముఖాముఖిలో చేనేత మహిళలతో బీవీ మమేకమై వారి సమస్యలను ఆలకించారు. - ఎమ్మిగనూరు

సమస్యలను ఇస్త్రీ చేస్తా...



అనునిత్యం వినూత్నంగా ఆలోచిస్తూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు కర్నూలు ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి టీజీ భరత్. తన స్థాయిని పక్కన పెట్టి ప్రజలతో మమేకమవుతూ ఎన్నికల ప్రచారంలో ఆయన ముందున్నారు. ఎక్కువ సమయం పేదలు, కూలీలు, చిరువ్యాపారులతో సమయం కేటాయిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ తాను ఉన్నానంటూ భరోసానిస్తున్నారు. అందులో భాగంగానే కర్నూలు నగరంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన... ఇలా ఇస్త్రీ చేసి రజకుల సమస్యలను తెలుసుకున్నారు. - కర్నూలు అర్బన్

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం పరిశీలన



పోస్టల్ బ్యాలెట్ సరళిని పరిశీలిస్తున్నగౌరు చరిత

కల్లూరు, మే 6: పాణ్యం-138 నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత పరిశీలించారు. సోమవారం బి.క్యాంపు ప్రభుత్వ బాలుర పాఠశాలను సందర్శించి పోస్టల్ బ్యాలెట్ సరళి తీరును పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పాణ్యం అసెంబ్లీ, నంద్యాల పార్లమెంట్ సెగ్మెంట్ ప్రభుత్వ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌ను పర్యవేక్షించారు.

ఇళ్లకు వైసీపీ స్టిక్కర్లు



ఇళ్లకు అతికించిన వైసీపీ స్టిక్కర్

వెల్దుర్తి, మే, 6: ఇళ్లకు వైసీపీ స్టిక్కర్ అతికిస్తూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. వైసీపీ మేనిఫెస్టో తుస్సుమనడంతో ఎలాగైనా గెలవాలనే విధంగా ప్రచారం సాగిస్తున్నారు. ఇందులోభాగంగా సోమవారం పట్టణంలోని 12వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 'జగన్ కోసం సిద్ధం' స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. అలాగే ఎల్.నగరంలో రాత్రికి రాత్రే స్టిక్కర్లు అతికించే పని పూర్తి చేశారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని చెబుతుంటే క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని టీడీపీ మండల అధ్యక్షుడు బలరాంగౌడు, కేశ నిఖిలేష్ అన్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

మొదటి రోజు 2,014 మంది

పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకున్న ఉద్యోగులు



ఆదోని పోలింగ్ కేంద్రంలో బారులుదీరిన ఉద్యోగులు



ఎమ్మిగనూరులో...



పోలింగ్ కేంద్రంలో ఉక్కపోతకు అల్లాడుతున్న మహిళా ఉద్యోగులు

కర్నూలు(కలెక్టరేట్), మే 6: మొదటి రోజు జిల్లాలో 6503 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగులో పాల్గొన్నారని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మొదటి రోజు 20351 మందికిగాను 6530 మంది (31.59 శాతం) పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. హోం ఓటింగ్‌కు సంబంధించి 997 మందికిగాను 634 మంది (64 శాతం) పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకునేందుకు ఎ.క్యాంపు ఇందిరాగాంధీ మెమోరియల్ పాఠశాలలో ఏర్పాట్లు చేశారు. మొదటి రోజే ఉద్యోగులు పెద్దఎత్తున తరలివచ్చారు. కర్నూలు అసెంబ్లీతోపాటు స్థానిక ఉద్యోగులు 1042 మంది, ఇతర జిల్లాల వారు 212 మంది మొత్తం 1254 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు పీసీ జాఫర్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆయనతోపాటు రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవ తేజ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్, అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే విశ్వేశ్వర రెడ్డి ఉన్నారు.

నంద్యాల (కల్చరల్): జిల్లాలోని అన్ని నియోజకవర్గాలతోపాటు నంద్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతవరణంలో సాగిందని జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు అన్నారు. నంద్యాల బాలికల జూనియర్ కళాశాలలో నంద్యాల అసెంబ్లీ కేంద్రానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగు సోమవారం జరిగింది. ఉదయం నుంచే ప్రారంభం కావాల్సిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ట్రైనింగ్ పేరుతో జాప్యం జరిగింది. పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో అత్యవసర సర్వీసుల ఉద్యోగ సిబ్బంది, నంద్యాల మున్సిపల్ టౌన్ హాలులో పోలింగ్ సిబ్బంది శిక్షణ అనంతరం మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకున్నారు. అయితే ఇతర జిల్లాలకు చెందిన కొంతమంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ పత్రాలు రాని కారణంగా సాయంత్రం 6.30 గంటల వరకూ ఉద్యోగులు వేచి ఉండాల్సి వచ్చింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో 5511 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నంద్యాల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జెసి రాహుల్‌కుమార్ రెడ్డి ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిమిత్తం చేసిన ఏర్పాట్లు, పోలింగ్ ప్రక్రియ జరుగుతున్న తీరును కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారికి వివరించారు.



కర్నూలులో సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు





నంద్యాలలో..

ఉద్యోగులూ.. ఆందోళన వద్దు

కర్నూలు(కలెక్టరేట్), మే 6: నంద్యాల జిల్లాలో పని చేసే పాణ్యం నియోజకవర్గానికి చెందిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ అంశంలో ఆందోళన చెందవద్దని పాణ్యం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జేసీ నారపురెడ్డి మౌర్య సోమవారం విజ్ఞప్తి చేశారు. పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ కోసం నంద్యాల జిల్లా ఆర్వోలకు ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకున్న అందరికీ పోస్టల్ బ్యాలెట్‌తో పాటు ఉద్యోగుల జాబితాను నంద్యాల జిల్లాకు ఎక్స్ఛేంజ్ ద్వారా పంపించామన్నారు. నంద్యాల జిల్లాలోని నియోజకవర్గాలకు సంబంధించిన ఆర్వోల వద్ద మొత్తం ఉద్యోగుల జాబితా (1221) ఉందన్నారు. ఉద్యోగులు సంబంధిత ఆర్వోల వద్దకు వెళ్లి జాబితాను చెక్ చేసుకోవాలని సూచించారు. ఒకవేళ జాబితాలో పేరు లేకపోతే కర్నూలు నగరంలోని బీ.క్యాంపులో ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటరులో మంగళవారంలోపు దరఖాస్తులను ఆర్వోకు సమర్పించాలన్నారు.



గొడుగుల నిండా.. ఎర్ర జెండా

పత్తికొండ టౌన్, మే 6: పత్తికొండలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించిన గొడుగుల ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పత్తికొండ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్టుహౌస్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ శ్రేణులు మండుటెండలో రోడ్‌షో నిర్వహించాయి. ఈ సందర్భంగా మహిళలు సీపీఐ రంగు, గుర్తులతో కూడిన గొడుగులను చేతబూని ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



పాణ్యం అభివృద్ధి చంద్రబాబు ఘనతే

● జగన్‌రెడ్డి పాలనలో ప్రజలు నలిగిపోయారు
● పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత


మాట్లాడుతున్న గౌరుచరిత




చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న గౌరు చరిత


చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న శబరి


హాజరైన నాయకులు, కార్యకర్తలు

కల్లూరు, మే 6: పాణ్యం నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకే చెందుతుందని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత స్పష్టం చేశారు. సోమవారం చెన్నమ్మ సర్కిల్ ప్రజాగళం బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గంలో ఎయిర్‌పోర్ట్, ఇండస్ట్రియల్ హబ్, సోలార్‌పార్క్, డీఆర్‌డీఓ, జయరాజ్ ఇస్పాత్ ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుదే అన్నారు. నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉపాధి కల్పించారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పాణ్యం వివక్షతకు గురైందని, ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. వైసీపీ నాయకులు భూ బకాసురులని, ప్రభుత్వ, వక్ఫ్‌బోర్డు, ప్రజలు భూములు కబ్జా చేశారని అన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక ఈ భూ బకాసురులను వదలమని, అన్యాయానికి గురైన బాధితులకు న్యాయం చేస్తామని అన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు రైతులు, ప్రజల సాగు, తాగునీటి సమస్యలపై చిత్తశుద్ధి లేదని, అలగనూరు రిజర్వాయర్ కట్టతెగి నాలుగేళ్లు గడిచినా మరమ్మతు చేయించలేకపోయారని విమర్శించారు. రూ.3 కోట్ల అంచనా దాదాపు రూ.36 కోట్లకు పెరిగే పరిస్థితి వచ్చిందన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ టీడీపీ హయాంలో 90 శాతం పూర్తయిందని, ప్రస్తుతం లీకేజీ వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, టీడీపీ అధికారంలోకి రాగానే మరమ్మతు పనులు పూర్తి చేస్తామని అన్నారు.

వైసీపీ కబ్జా పాలన

● ఎమ్మెల్యే ఇల్లు కబ్జా చేసి కట్టిందే..
● నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి డా. బైరెడ్డి శబరి

కల్లూరు, మే 6: పాణ్యం నియోజకవర్గం వైసీపీ పాలనలో కబ్జాల నిలయంగా మారిందని నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. సోమవారం చెన్నమ్మసర్కిల్లో నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ అదిగో....ఆ కనిపించే ఎమ్మెల్యే ఇల్లు కబ్జా చేసి కట్టిందే అన్నారు. స్కూల్, ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసి విలాసవంతమైన ఇళ్లు కట్టుకున్నారని ఆరోపించారు. దీనికి కల్లూరు తహసీల్దారు కార్యాలయంలో పనిచేసిన నలుగురు ఉన్నతస్థాయి ఉద్యోగులు ఎమ్మెల్యేకు పూర్తిగా సహకరించారని ఆమె ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించే దమ్మున్న నాయకుడు చంద్రబాబే అన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల బతుకులను మారుస్తాయని అన్నారు.

చంద్రబాబుకు ఘనస్వాగతం పలికిన టీడీపీ నాయకులు

చెన్నమ్మ సర్కిల్ ప్రజాగళం బహిరంగ సభకు విచ్చేసిన చంద్రబాబును సోమవారం బళ్లారి చౌరస్తా ఏపీఎస్పీ బెటాలియన్-2లో హెలీప్యాడ్ వద్ద కర్నూలు ఎంపీ డాక్టర్.సంజీవ కుమార్, కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్, పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత, నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి కలిసి పూలబొకేలు అందించి స్వాగతం పలికారు.

నా పొలాన్ని వైసీపీ కౌన్సిలర్ ఆక్రమించాడు

● ఎమ్మెల్యే శిల్పాను నిలదీసిన బాధితుడు


ఎమ్మెల్యేను నిలదీస్తున్న బాధితుడు

నంద్యాల రూరల్, మే 6: వైసీపీ కౌన్సిలర్ తన పొలాన్ని ఆక్రమించాడని, న్యాయం చేయాలని బాధితుడు ముజీఫ్ ఎమ్మెల్యే శిల్పాను నిలదీశారు. పట్టణంలోని 3వ వార్డులోని నడిగడ్డలో ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇషాక్ తదితరులు సోమవారం ఎన్నికల ప్రచారం సందర్భంలో ఈ ఘటన జరిగింది. మూలమఠం పరిసరాల్లో ఉన్న తన పొలంలో కొంతభాగమైన 16.50 సెంట్ల పొలాన్ని 6వ వార్డు వైసీపి కౌన్సిలర్ భీమనపల్లి పురందర్ కుమార్, తండ్రి భీమనపల్లి వెంకటసుబ్బయ్య ఆక్రమించుకున్నారని, న్యాయం చేయాలని ఎమ్మెల్యేని నిలదీశారు. ఎన్నికలు అయ్యాక న్యాయం చేస్తానని ఎమ్మెల్యే చెప్పగా.. తనకు నమ్మకం లేదని, కాగితంపై రాసివ్వాలని ఎమ్మెల్యేను నిలదీశారు. ఈ నేపథ్యంలో అక్కడ కొంత ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అక్కడ ఉన్నవారు సర్ది చెప్పటంతో పరిస్థితి సద్దుమణిగింది.

టీడీపీ నాయకుల ప్రచారం

మహానంది, మే 6: మహానంది గ్రామ పంచాయతీ పరిధిలోని దేవస్థానం కాలనీ, ఈశ్వర్ నగర్ కాలనీలో సోమవారం టీడీపీ నాయకులు సూర్య శ్రీనివాసులు, గని చిన్న రంగస్వామి, రామచంద్రుడు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఓటు వేసే విధానంపై కార్యకర్తలు వివరించారు. టీడీపీ గెలిస్తేనే ప్రజల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మహానంది దేవస్థానం మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునరావు, కృపవరం, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, సరోజమ్మ పాల్గొన్నారు.

కొత్తపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని గ్రామ టీడీపీ నాయకులు శివారెడ్డి, మల్లయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం మండలంలోని పెద్దగుమ్మడాపురంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పల్లెసీమలు ప్రశాంతత టీడీపీతోనే సాధ్యమవుతుందని అన్నారు. మేనిఫెస్టో గురించి వివరించారు. నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరిని, ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్యను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, కురుమయ్య, శ్రీరాములు, అంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఐసెట్

పాణ్యం, మే 6: మండలంలోని ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలల్లో సోమవారం ఐసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆర్జీఎంలో ఉదయం 280 మందికి గాను 25 మంది, సాయంత్రం 29 మంది గైర్హాజరైనట్లు పరీక్షల ఛీఫ్ సూపరింటెడెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. శాంతిరాంలో ఉదయం 61 మందికి గానూ 4గురు, సాయంత్రం 62 మందికి గాను ముగ్గురు అభ్యర్థులు గైర్హాజరైనట్లు ఛీఫ్ సూపరిండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: ఫరూక్


ప్రచారం చేస్తున్న ఫరూక్, సుబ్బారెడ్డి తదితరులు

నంద్యాల రూరల్, మే 6: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చగల సమర్థుడు చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని టీడీపీ నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ స్పష్టం అన్నారు. నంద్యాల మండలంలోని పెద్దకొట్టాల, సుగాలిమెట్ట, చాబోలు తదితర గ్రామాలలో సోమవారం ప్రచారం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ప్రభంజనం సృష్టిస్తుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తులసిరెడ్డి, శివనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం: బైరెడ్డి

మిడుతూరు, మే 6: టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతందని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని పీరుసాహెబ్ పేట, నాగలూటి, పైపాలెం గ్రామాల్లో బైరెడ్డి రోడ్ షో నిర్వహించారు. కూటమి మేనిఫెస్టో వల్ల మహిళలకు, రైతులకు, నిరుద్యోగులకు, అన్ని సామాజిక వర్గాల వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జయరాముడు, భగీరథరెడ్డి, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

మహానంది, మే 6: మహానంది మండలం మసీదుపురం గ్రామానికి చెందిన ఉపాధీ హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సుభాష్‌ను విధుల నుంచి తొలగించినట్లు కలెక్టర్ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఏప్రిల్ 29వ తేదీన శ్రీశైలం అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన శిల్పా చక్రపాణిరెడ్డి ఎన్నికల ప్రచారం కారణంగా ఫీల్డ్ అసిస్టెంట్ సుభాస్ ఆరోజు ఉపాధిహామీ పనులు నిలిపి వేసి ప్రజల జీవనోపాధికి ఆటంకం కలిగించినట్లు ఆరోపణలు రుజువుకావడంతో విధుల నుంచి తొలగించామని చెప్పారు.

33 మంది బైండోవర్

కొత్తపల్లి, మే 6: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో 33 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలో 180 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

టీడీపీ విజయం తథ్యం: బుడ్డా


చిన్నారిని ఎత్తుకున్న బుడ్డా రాజశేఖరరెడ్డి


శ్రీశైలంలో ప్రచారం చేస్తున్న మేఘన రెడ్డి


ఆత్మకూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న బుడ్డా వైష్ణవిరెడ్డి

వెలుగోడు, మే 6: ఈ ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. సోమవారం ఆయన వెలుగోడు మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. బోయరేవుల గ్రామంలో సర్పంచ్ స్వామన్న, కొండా ఎల్లా స్వామి, సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో మోతుకూరు గ్రామంలో సుధాకరరెడ్డి, రామానాయుడు ఆధ్వర్యంలో మాధవరం గ్రామంలో భూపాల్ చౌదరి, సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో ,గుంతకందాల గ్రామంలో శివన్న, శ్రీనివాసులుల ఆధ్వర్యంలో రోడ్‌షోలు నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. బుడ్డా మాట్లాడుతూ అరాచక పాలన కొనసాగిస్తున్న వైసీపీని ఇంటికి సాగనంపాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి స్థానికంగా ఉండే బుడ్డా కావాలో స్థానికేతరుడైన శిల్పా కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు యువతకు ఉద్యోగులకు ప్రతి ఒక్కరికి కలిగే ప్రయోజనాల గురించి ఆయన వివరించారు. తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా బైరెడ్డి శబరిని గెలిపించాలని కోరారు. గ్రామాల్లో నాయకులు గజమాలలు వేసి పుష్ప గుచ్చాలు అందజేసి బుడ్డాకు ఘన స్వాగతం పలికారు. బుడ్డారాజశేఖరరెడ్డి మాధవరం గ్రామంలో మహిళలతో కలిసి సెల్ఫీ తీసుకున్నారు. అలాగే బోయ రేవుల గ్రామంలో చిన్నారుని ఎత్తుకుని ఆశీర్వదించారు.

వేల్పనూరులో ఆయన సతీమణి బుడ్డా శైలజ, టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, ధర్మారెడ్డి, మహేశ్వరరెడ్డి భారీ జనంతో ప్రచారం చేశారు. విజయం తమదేనని విజయ సంకేతం చూపిస్తూ వారు ముందుకు సాగారు. అలాగే వెలుగోడు పట్టణంలో బుడ్డా శైలజ అక్క రమాదేవి, బుడ్డా అల్లుడు సాయి జయంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు అన్నారపు సీతమ్మ, ఎల్లాల కృష్ణుడు, చంద్రా సీతాలక్ష్మమ్మ, మాజీ సర్పంచ్ కలాం, ఖలీల్, హిదాయత్ జనసేన నాయకులు షాలు బాషా, ఎమ్మార్పీఎస్ నాయకులు నాగేశులు, బీజేపీ నాయకులు నాగేశ్వరరావు, రాము, జనార్దన్, పాల్గొన్నారు.


వేల్పనూరులో విజయ కేతనం చూపిస్తున్న బుడ్డా శైలజ

శ్రీశైలం: శ్రీశైలం, లింగాలగట్టులో సోమవారం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి కుమార్తె మేఘనారెడ్డి ప్రచారం నిర్వహించారు. లింగాలగట్టు మత్స్యకారులను ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఆమె శ్రీశైలం చేరుకుని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. లలితాంబికా కాంప్లెక్స్, సిద్ధరామప్ప కాంప్లెంక్స్‌లలో వ్యాపారుల వద్దకు వచ్చి టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శ్రీనివాసరెడ్డి, రామయ్య, చెన్నకేశవులు, శ్రీను, అశోక్, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: శ్రీశైలం ఎమ్మెల్యేగా తమ బాబాయి బుడ్డా రాజశేఖరరెడ్డిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బుడ్డా సీతారామిరెడ్డి కుమార్తె బుడ్డా వైష్ణవి రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. ఇందిరానగర్‌లో ఇంటింటికి పర్యటించి గత టీడీపీ పాలనలో తన బాబాయ్ బుడ్డా నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. అలాగే టీడీపీ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టబోయే సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఈవీఎంలో సైకిల్ గుర్తుకు ఓటు వేసే విధానాన్ని ఓటర్లకు అవగాహన కల్పించారు. ఆమె వెంట స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.

జగన్‌ను ఇంటికి సాగనంపాలి: మాండ్ర


దేవనూరులో మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి


నెహ్రూనగర్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న లింగారెడ్డి


ఎర్రగుడూరులో రోడ్ షో నిర్వహిస్తున్న మాండ్ర

పాములపాడు, మే 6: ఒక్క చాన్స్ అంటూ ప్రజలకు నమ్మించి అధికారంలోకి వచ్చాక జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, ఆంధ్ర ప్రదేశ్‌ను అప్పులు రాష్ట్రంగా మార్చిన సీఎం జగన్‌ను ఇంటికి సాగనంపడానికి ప్రజలంతా సిద్ధంగా ఉండాలని నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రగూడూరు, బానకచెర్ల, వేంపెంట గ్రామాల్లో సోమవారం రోడ్ షో నిర్వహించారు. వారు మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గం అబివృద్ధి చెందాలంటే స్థానికుడైన ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య, ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరిని గెలిపించాలని ప్రజలను కోరారు. సైకో జగన్ పాలనలో దోచుకోవడం దాచుకోవడం తప్ప అభివృద్ధి శూన్యమని అన్నారు. తెలిపారు రాష్ట్రంలో పరిశ్రమలు రాక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేక పక్క రాష్ట్రాలకు వలసలు వెల్లాల్సిన దుస్థితిని నెలకొల్పారని మండిపడ్డారు." టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, హరినాథరెడ్డి, నాగార్జునరెడ్డి, చంద్రశేఖర్, బాస్కరరెడ్డి, గోవిందు, మధుకృష్ణ, లక్ష్మీకాంతరెడ్డి, ఆదిరెడ్డి, సురేశ్, కృష్ణ, హఫీజ్, సత్యంరెడ్డి, జనార్దన్, రామకృష్ణ, ఏసేపు, లింగస్వామి, రాము, నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'మల్లికార్జున రిజర్వాయర్‌ను అడ్డుకుంటాం'

మిడుతూరు: మిడుతూరు మండలానికి మల్లికార్జున రిజర్వాయర్ రాకుండా అడ్డుకుంటామని, అదేవిధంగా మండలానికి సాగు నీరు అందించి రైతులను, రైతు కూలీలను ఆదుకుంటామని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానంద రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా సోమవారం కలమందలపాడు, మాసపేట, 49 బన్నూరు, దేవనూరు, చింతలపల్లి గ్రామాల్లో శివానందరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య కలిసి మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, గుండం రమణ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. వారు మాట్లాడుతూ మిడుతూరు మండలంలో మల్లికార్జున రిజర్వాయర్ నిర్మించడం వల్ల కొన్ని గ్రామాలు అందులో కలిసిపోతాయని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో సర్వోత్తమరెడ్డి, రాజశేఖరరెడ్డి, రమణరెడ్డి, సోఫిసాహెబ్, వెంకటేశ్వర రెడ్డి, రమణ రెడ్డి, మణివర్ధన్ రెడ్డి, శివరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.


నందికొట్కూరులో జయసూర్యను సన్మానించిన ముస్లింలు

'ప్రజల చూపు టీడీపీ వైపే'

నందికొట్కూరు: జగన్ అరాచక పాలనపై విసుగెత్తిన ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. సోమవారం నందికొట్కూరులో ఎన్నికల శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. 26వ వార్డు ఇన్‌చార్జి మల్లికార్జున్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి జాకీర్ హుస్సేన్, పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మూర్తుజావళి, అనూరాధ, లింగమయ్య, రవికుమార్, మాబాషా ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. జయసూర్య మాట్లాడుతూ పట్టణంలోని తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, భరత్‌రెడ్డి, అయ్యన్న, అప్సర్ బాషా, రసూల్, గోవర్ధనగిరి, ఎల్లయ్యచారి, కళాఖర్, ప్రభుకుమార్, సురేంద్ర, పాణ్యం వేణుగోపాల్, మోహన్ పాల్గొన్నారు.

'చంద్రబాబు వస్తేనే ప్రజలకు భవిష్యత్తు'

పగిడ్యాల: టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే ప్రజల భవిష్యత్తు బాగుంటుందని టీడీపీ సీనీయర్ నాయకుడు మాండ్ర లింగారెడ్డి అన్నారు. మండలంలోని నెహ్రూనగర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఉపాధి కూలీలతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక నిత్యవసర సరుకుల ధరలు పెరగడంతో కూలీలు, ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్యకు, ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలుపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, లోకానందరెడ్డి, రామస్వామి, నాగరాజు తదితరులు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో గందరగోళం

● ఇబ్బందులు పడ్డ ఉద్యోగులు


నందికొట్కూరు: జాబితాలో పేర్లు లేకపోవడంతో చెట్ల కింద కూర్చున్న ఓటర్లు

నందికొట్కూరు, మే 6: పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ప్రక్రియ అంతా నందికొట్కూరు నియోజకవర్గంలో గందరగోళం నెలకొంది. నందికొట్కూరులో 2,360 ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగిం చుకునేందుకు 9 పోలింగ్ కేంద్రాలను ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే ప్రారంభం కావాల్సిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ట్రైనింగ్ పేరుతో జాప్యం జరిగింది. నియోజకవర్గంలో ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన ఇతర జిల్లాకు చెందిన ఉద్యోగుల పేరు పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల జాబితాలో లేకపోవడంతో అంతా గందరగోళం ఏర్పడింది. కొందరు మహిళా ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోవడంతో ఎవరిని అడగాలో తెలియక ఎండలో తిరగలేక చెట్టుకింద కూర్చున్నారు. డిక్లరేషన్ ఫారంపై గెజిటెడ్ సంతకం లేకుండా కొన్ని ఓట్లు పోలైనట్లు తెలుస్తోంది. ఏజెంట్లు అభ్యంతరం తెలపడంతో పోలింగ్ ప్రక్రి యను నిలుపుదల చేసి గజిటెడ్ సంతకం చేసేందుకు హెచ్ఎంలను అక్కడికి పిలిపించారని ఏజెంట్లు తెలిపారు.

ఆత్మకూరు: శ్రీశైల నియోజకవర్గంలో శిక్షణ పొందుతున్న పీవో, ఏపీవో, మైక్రో అబ్జర్వర్లు, రిటర్నింగ్ అధికారి బృందం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫెసిలిటేషన్ సెంటర్, ఏపీవోలకు డీపాల్ స్కూల్ సెంటర్, అత్యవసర సేవలు అందించే మెడికల్, పోలీసులకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. అయితే చాలా మంది ఉద్యోగులకు సంబంధించిన పేర్లు జాబితాలో లేకపోవడంతో ఇతర జిల్లాలు, నియోజకవర్గాలకు చెందిన ఉద్యోగులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. సాయంత్రం వరకు ఇక్కడే ఉంచుకుని చివరకు ఓటు లేదంటే ఎలా అని ఆర్వో సుధారాణిని నిలదీశారు. తాము ఫారమ్ -12 కింద పోస్టల్ ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ చివరకు తమ సొంత నియోజకవర్గాల్లో, డ్యూటీలు కేటాయించిన నియోజకవర్గాల్లో కూడా ఓటు లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. చివరకు బ్యాలెట్ పత్రాలు ఉంచే కవర్ల కొరత ఉండటం వల్ల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పత్రాలను ఒకే కవర్లో వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. పలు సందర్భాల్లో ఇలాంటి ఓట్లు చెల్లని ఓట్లుగా గుర్తించే ప్రమాదం ఉందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కాగా ఫెసిలిటేషన్ సెంటర్లలోని బ్యాలెట్ బాక్స్‌లకు తాళాలు, సీల్ వేయకపోవడంపై ఉద్యోగులు మండిపడుతున్నారు. పలు సందర్భాల్లో ఉద్యోగులు అక్కడే భైఠాయించి ఎన్నికల అధికారుల తీరుపై నిరసనలు వ్యక్తం చేశారు. మొత్తానికి 7వ తేదిన మరోసారి ఫారమ్-12 కింద దరఖాస్తు చేసుకుంటే 8వ తేదిన ఓటు హక్కుకు అవకాశం కల్పిస్తామని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిక


చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన చింతకుంట నాగిరెడ్డి

ఆళ్లగడ్డ, మే 6: ఆళ్లగడ్డలో వైసీపీకి పెద్ద షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన పి.చింతకుంట మాజీ సర్పంచ్ దివంగత ఇంజేటి కృష్ణారెడ్డి తనయుడు నాగిరెడ్డి తన అనుచరులతో కలిసి మాజీ సీఎం చంద్రబాబు సమక్షంలో భూమా విఖ్యాత్‌రెడ్డి, కాటన్ బోర్డు మాజీ సభ్యుడు సి.శ్రీనివాసరెడ్డి(వాసు) ఆధ్వర్యంలో సోమవారం టీడీపీలో చేరారు. నాగిరెడ్డికి పార్టీ కండువా కప్పి చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించారు. నాగిరెడ్డితో పాటు చంద్రారెడ్డి, నాగిరెడ్డి టీడీపీలో చేరారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కోవెలకుంట్ల, మే 6: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవా రం విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భానుముక్కల విశ్వరూపాచారి, వీరబ్రహ్మాచారి, కుమారాచార్య ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తునికపాటి మురళీ మోహనాచారి, ప్రధాన కార్యదర్శిగా టంగుటూరు రాఘవాచారి, కోశాధికారిగా ముత్తోజి హరికృష్ణమాచారి, కె. శుభకర్ణాచారి, ఉపాధ్యక్షులుగా రాజేశ్వరచారి, శ్రీనివాచారి, సుబ్రహ్మణ్యమాచారి, సహాయ కార్యదర్శులుగా ఉదయకుమా రాచారి, రామయ్యాచారి, రమేశ్‌ఆచారి, కార్యవర్గ సభ్యులుగా బ్రహ్మయ్యాచారి, జయంత్ ఆచారి, పుల్లయ్యాచారి, మల్లిఖార్జునాచారి, గురువయ్య ఆచారి, మనో హర్ ఆచారి, శ్రీనివాసాచారిలను ఎన్నుకున్నారు.

వాహనాలకు భారీ జరిమానా

డోన్(రూరల్), మే 6: పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై సోమ వారం తెల్లవారుజామున ఆర్టీవో అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు బస్సులకు భారీ జరిమానాలు విధించారు. తాడిపత్రికి చెందిన ప్రైవేటు బస్సు హైదరాబాదు నుంచి కదిరికి వెళ్తుండగా వాటిని తనిఖీ చేయగా సరైన పత్రాలు లేకపోవడంతో రూ.2,45,500 జరిమానా విధించినట్లు ఆర్టీవో క్రాంతి కుమార్ తెలిపారు. అలాగే మరో ప్రైవేటు బస్సుకు రూ.2.26 లక్షలు, అధిక లోడుతో వెళ్తున్న మరో వాహనానికి రూ.88వేలు విధించామన్నారు.

ఎం. పెండేకల్‌లో 40 బర్రెలు మృతి

బేతంచెర్ల, మే 6: మండలంలోని ఎం.పెండేకల్లు గ్రామంలో జొన్న నాము తిని 40 బర్రెలు మృతి చెందాయి. దీంతో సుమారు రూ.12 లక్షల నష్టం వాటిల్లినట్లు బర్రెల యజమానులు తెలిపారు. సోమవారం సాయంత్రం గ్రామ సమీపంలోని జొన్న పంట కోసిన తర్వాత జొన్న నాము తిని మృతి చెందినట్లు బర్రెల యజమానులు తెలిపారు. విషయం తెలుసుకున్న పశుసంవర్ధకశాఖ ఏడీ వసంతలక్ష్మి పశువైద్యులు గేదెల మృతికి కారణాలు తెలుసుకుని నష్టం అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

వైసీపీ ఎన్నికల ప్రచారంలో వీవోఏ


నల్లవాగుపల్లెలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వీవోఏ చంద్రశేఖర్‌రెడ్డి

రుద్రవరం, మే 6: మండలంలోని నల్లవాగుపల్లె గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఆదివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆళ్లగడ్డ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పూలమాల వేస్తూ, వైసీపీ నాయకుల వెంట ప్రచారంలో ఇలా పాల్గొన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి నక్కలదిన్నె గ్రామం తేజస్వి గ్రామైక్య సంఘానికి వీవోఏగా పనిచేస్తున్నారు.

పోలింగ్ నిర్వహణపై శిక్షణ

ఆళ్లగడ్డ, మే 6: ఈ నెల 13వ తేదిన జరుగనున్న పోలింగ్ నిర్వహణపై పీవో, ఏపీవోలకు ఆళ్లగడ్డ పట్టణంలోని వైపీపీఎం కళాశాలలో సోమవారం శిక్షణ ఇచ్చారు. పోలింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి శిక్షకుడు వివరించారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రం సుభిక్షం'

దొర్నిపాడు, మే 6: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని టీడీపీ నాయకులు భూమా బ్రహ్మానందరెడ్డి, మల్లేశ్వరచౌదరి అన్నారు. సోమవారం మండలంలోని బుర్రారెడ్డిపల్లె, ఇందిరానగర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ రూపొందించిన మేనిఫెస్టో గురించి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, తిరుపాలయ్య, అస్లాంబాషా, వెంకటరమణ, సుధాకర్, బాబు తదితరులు ఉన్నారు.

కొండమనాయుని పల్లెలో టీడీపీ ప్రచారం

అవుకు, మే 6: మండలంలోని కొండమనాయుని పల్లెలో టీడీపీ నాయకుడు శివారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం విస్తృత ప్రచారం చేశారు. రాయలసీమ ఉద్యమకారుడు సీమకృష్ణతో కలిసి ప్రచారం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రచారంతో ఓటర్లలో చైతన్యం వచ్చిందన్నారు.

గిరిజనులకు సౌకర్యాలు కల్పించాలి

బేతంచెర్ల, మే 6: తండాల్లో గిరిజనులకు ప్రభుత్వ పథకాలతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఏపీ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరి ఓంకార్ పేర్కొన్నారు. నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలంలోని బుగ్గానిపల్లె తండా, గోరుమానుకొండ తండా గిరిజన ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు.

వైసీపీ పాలనలో సామాజిక న్యాయం లేదు: బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, మే 6 : వైసీపీ పాలనలో సామాజిక న్యాయం చేతల్లో లేదని టీడీపీ తెలుగు మహిళ నాయకురాలు బీసీ ఇందిరమ్మ విమర్శించారు. సోమవారం మండలంలోని రామతీర్థం, బీరవోలు, చెర్వుపల్లె గ్రామాల్లో బీసీ ఇందిరమ్మ ప్రజాగళంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బీసీ జనార్దన్‌రెడ్డి చేసిన అభివృద్ధి తప్ప వైసీపీ హయంలో అభివృద్ధి నిల్ అన్నారు. గత 5 ఏళ్లనుంచి బోరు వేయించడం చేతకాక ఎన్నికల ముందు బోరు వేయించి కోడ్ వల్ల అధికారులు ఆపితే ఆ నింద బీసీ కుటుంబం మీద వేయడం వైసీపీ నాయకులకు సిగ్గుచేటన్నారు. వైసీపీ నాయకులు నిబంధనల పేరుతో సంక్షేమ పథకాలకు తూట్లు పొడిచారని అన్నారు.

టీడీపీతోనే మహిళలకు గౌరవం: బీసీ క్షీరారెడ్డి

కొలిమిగుండ్ల రూరల్: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రంలో మహిళలకు సముచిత గౌరవం లభిస్తుందని ఆ పార్టీ అభ్యర్థి బీసీ జనార్దనరెడ్డి కోడలు బీసీ క్షీరారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కుటుంబ సభ్యులు బీసీ మౌర్యానాథ్‌రెడ్డి, మాధవీరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డిలతో కలిసి తుమ్మలపెంట గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు అమలు చేసే ఉచిత బస్సు ప్రయాణం, 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, అమ్మకు వందనం, ఆడబిడ్డ నిధి, మహిళలకు చే యూత తదితర సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక మంలో గూడూరు నాగేశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, తుమ్మలపెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: బీసీ రామనాథరెడ్డి

కోవెలకుంట్ల: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బీసీ జనా ర్దన్‌రెడ్డి సోదరుడు బీసీ రామనాథరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కోవెల కుంట్ల పట్టణ శివారులోని చెర్వుకట్టలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి బీసీ రామనాథరెడ్డి, టీడీపీ నాయకులు గడ్డం రామకృష్ణారెడ్డి, బీవీ ప్రసాదరెడ్డిలతో కలసి ఎన్నికల ప్రచారం చేశారు. రామనాథరెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బిజనవేములలో మాజీ ఎమ్మెల్యే బీసీకి హారతులు ఇస్తున్న మహిళలు




రామతీర్థంలో ప్రజాగళంలో మాట్లాడుతున్న బీసీ ఇందిరమ్మ, బీసీ కుటుంబ సభ్యులకు స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు, ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బీసీ రామనాథరెడ్డి

మంత్రి బుగ్గన అవినీతిని ప్రజలు తెలుసుకున్నారు

» వైసీపీ పని అయిపోయింది..
» డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మే 6: అధికారాన్ని అడ్డం పెట్టుకుని మంత్రి బుగ్గన చేసిన అవినీతిని డోన్ నియోజకవర్గ ప్రజలు తెలుసుకున్నారని, ఇక వైసీపీ పని అయిపోయినట్లేనని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కోట్ల సమక్షంలో వైసీపీ నాయకులు ఆర్‌ఈ బాబు, ఆర్‌ఈ రాజశేఖర్‌తో పాటు మరి కొంత మంది టీడీపీలో చేరారు. శ్రీరామ్‌నగర్‌కు చెందిన వైసీపీ నాయకుడు వేణు కుటుంబ సభ్యులతో పాటు మరో 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి బుగ్గన అక్రమంగా సంపాదించిన డబ్బును ఆశ చూపి గెలవాలని చూస్తున్నారని అన్నారు. కానీ ప్రజలు బుగ్గనను నమ్మే పరిస్థితి లేదన్నారు. మంత్రి పక్కన ఉన్నవారంతా దందాలు, మట్కా, ఇసుక మాఫియా, అక్రమ మద్యం వ్యాపారాలు చేసే వారే అ న్నారు. తాము ప్రజలనే నమ్ముకుని ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి తీరుతానన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ లక్ష్మీరెడ్డి, మర్రి రమణ, తిమ్మయ్య యాదవ్, శ్రీనివాస భట్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, సీమ సుధాకర్ రెడ్డి, చంద్రపల్లి ఆచారి, బీజేపీ నాయకుడు వడ్డె మహారాజ్ పాల్గొన్నారు.


హెచ్.కొట్టాలలో ఎన్నికల ప్రచారంలో మహిళలతో కోట్ల సుజాతమ్మ

క్రైస్తవుల అభివృద్ధికి చంద్రబాబుతోనే: కోట్ల సుజాతమ్మ

టీడీపీ అధినేత చంద్రబాబుతోనే క్రైస్తవుల అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. సోమవారం పట్టణంలో సమైక్య క్రైస్తవ సమావేశాన్ని పాస్టర్ శామ్యూల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో క్రైస్తవ సేవకులందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించడంతో పాటు గృహాలు నిర్మించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కోట్రికే హరికిషన్, మర్రి రమణ, భాష్యం శ్రీధర్‌గౌడు, ఓంప్రకాష్, సమైక్య క్రైస్తవ కమిటీ సభ్యుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

● **పొదుపు మహిళలకు వడ్డీ లేని రుణాలు:** చంద్రబాబు అధికారంలోకి రాగానే డ్వాక్రా సంఘాల మహిళలకు వడ్డీ లేకుండా రూ.10 లక్షల రుణాలు ఇస్తామని టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత అన్నారు. మండలంలోని కోట్రాయి, తిరునాంపల్లి గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మర్రి మణి, గిరి ప్రసాద్ రెడ్డి, డా.బీవీ రామక్రిష్ణారెడ్డి, బాలిరెడ్డి, గిడ్డారెడ్డి, సౌజన్య, చాటకొండ రజిని పాల్గొన్నారు.

వైసీపీకి గుణపాఠం చెప్పండి

బేతంచెర్ల: రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించి దౌర్జన్యాలకు, భూకబ్జాలకు, మద్యం మాఫియా కొనసాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని హెచ్. కొట్టాల, బలపాలపల్లి గ్రామాల్లో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని, ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎండూరి మహేష్, కోమల యోగేంద్రబాబు, నందీశ్వరుడు, బలపాలపల్లి నాయకులు సుధాకర్, మేకల నాగరాజు, రూబెన్, కార్యకర్తలు పాల్గొన్నారు.


కోట్ల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

30 కుటుంబాలు టీడీపీలో చేరిక: మండలంలోని బుగ్గానిపల్లె తాండా గ్రామానికి చెందిన 30 కుటుంబాల వైసీపీ కార్యకర్తలు టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, పట్టణ టీడీపీ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో డోన్ టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బుగ్గానిపల్లె తాండాకు చెందిన శ్రీనివాస్ నాయక్ అడ్వకేట్ స్వామి నాయక్, మధు నాయక్, సోమ్లా నాయక్, రాము నాయక్, రామ్మూర్తి నాయక్, వెంకట నాయక్, శంకరిబాయి, వార్డు సభ్యులు సత్యబాయి, లక్ష్మీబాయి, రుక్మిణీబాయి ఉన్నారు. అలాగే మరో 28 మంది కుటుంబాలు టీడీపీ సెల్ మండల అధ్యక్షుడు నాయని చంద్రుడు, పట్టణ సమన్వయ చైర్మన్ సుధాకర్ సమక్షంలో టీడీపీలో చేరారు.

ప్యాపిలి: మండలంలోని భోంచెర్వుపల్లి, లక్ష్మీతండా గ్రామా లకు చెందిన 30 మంది వైసీపీ వర్గీయులు సోమవారం డోన్‌లోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. చంద్రబాబు మెనిఫెస్టోకు ఆకర్షితులై తాము పార్టీలోకి చేరినట్లు తెలిపారు.

ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

డోన్, మే 6: డోన్ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ల పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆరు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. మరో పోలింగ్ కేంద్రం ఇతర జిల్లా వారికి ఏర్పాటు చేశారు. మొత్తం 2,049 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు గానూ తొలి రోజు 1,040 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకున్నట్లు ఆర్వో మహేశ్వరరెడ్డి తెలిపారు.

బనగానపల్లె: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తహసీల్దారు కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో సోమవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పద్ధతిలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. తొలి రోజు మొ త్తం 2856 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు గాను 985 ఓట్లు పోలయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు సోమవారం తెలిపారు.

నంద్యాల, మే 6(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని వైపీపీఎం కళాశాలలో, బాలికల ఉన్నత పాఠశాలలో, తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకున్నారు. నియోజకవర్గంలో 1500 పోస్టల్ బ్యాలెట్లు ఉండగా అందులో 1400 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నేడు కొలిమిగుండ్లలో టీడీపీ భారీ రోడ్‌షో

కొలిమిగుండ్ల రూరల్, మే 6: కొలిమిగుండ్లలో మంగళవారం సాయంత్రం బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి భారీ రోడ్‌షో నిర్వహించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి, పార్టీ ప్రచార కార్యదర్శి కోటపాడు శివరామిరెడ్డి వెల్లడించారు. ముందుగా 5గంటలకు చింతలాయపల్లె గ్రామంలో రోడ్ షో నిర్వహించి, అనంతరం 6గంటలకు కొలిమిగుండ్ల రోడ్‌షోలో పాల్గొంటారని తెలిపారు. ఈ రోడ్‌షోలో టీడీపీ నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి పాల్గొంటారన్నారు.

అహోబిలంలో సుదర్శన హోమం

నంద్యాల, మే 6(ఆంధ్రజ్యోతి): అహోబిలంలో వెలసిన నవనారసింహ క్షేత్రాలలో ఒకటైన వరాహనరసింహస్వామి జయంతిని పురస్కరించుకొని ఆయన సన్నిధిలో సోమవారం సుదర్శన హోమం నిర్వహించారు. ముందుగా వరాహ నరసింహస్వామిని వేకువజామున్నే అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం అభిషేకం చేపట్టి సుదర్శన హోమాన్ని వేదమంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా ఉమామహేశ్వర స్వామి కల్యాణం

బనగానపల్లె, మే 6 : బనగానపల్లె మండలంలోని యాగంటి క్షేత్రంలో మాసశివరాత్రి సందర్భంగా ఉమామహేశ్వర కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు మహేశ్వర శర్మ, ఇతర అర్చకుల ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించారు.

శ్రీనివాసులు మృతి బాధాకరం

బనగానపల్లె రూరల్, మే 6: బనగానపల్లె పట్టణం తెలుగుపేటకు చెందిన శ్రీనివాసులు (47) మృతి చెందడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ అన్నారు. బనగానపల్లె అగ్నిమాపక కేంద్రంలో శ్రీనివాసులు డ్రైవర్‌గా విధులు నిర్వర్తిం చేవారు. అనారోగ్యంతో సోమవారం శ్రీనివాసులు మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీసీ ఇందిరమ్మ తెలుగుపేటకు వెళ్లి శ్రీనివాసులు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు.

వెదురు వేలం

రుద్రవరం, మే 6: రుద్రవరం కలప డిపోలో సోమవారం సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి కలప వెదురు వేలం నిర్వహించారు. ఈ వేలంలో టేకు 16దుంగలు రూ.7600, కాట్ 1 రూ.8100, సెకండ్‌క్లాస్ వెదుర్లు 40 రూ.1600, థర్డ్‌క్లాస్ వెదురు 200 రూ.3వేలు, ఎంకేఎస్ కర్రలు 1500 రూ.9300, కలప 42 దుంగలు రూ.5వేలు మొత్తం రూ.34,600 ఆదాయం వచ్చిందని చెప్పారు. ఈ వేలంలో రేంజర్ శ్రీపతినాయుడు సెక్షన్ ఆఫీసరు నాగరాజు, బీట్ ఆఫీసర్ మహబూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థులకు ఓటు వేస్తేనే అభివృద్ధి: అఖిలప్రియ



శిరివెళ్లలో మాట్లాడుతున్న భూమా అఖిలప్రియ, మద్దూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న భూమా అఖిలప్రియ

శిరివెళ్ల, మే 6: సమర్థవంతమైన నాయకులకు ఓట్లు వేస్తేనే నియోజకవర్గాలు, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని మాజీ మంత్రి, ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. శిరివెళ్లలోని 95, 96, 99 బూత్‌ల పరిధిలోని మహిళలతో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ టీడీపీకి మహిళలే బలం అని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు, విద్యుత్ బిల్లులు పెరగడంతో సామాన్యుల జీవనం దుర్భరంగా మారిందన్నారు. ప్రజల కష్టాలను తీర్చేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలతో కూడిన మేనిఫెస్టోను విడుదల చేశారన్నారు. ఆళ్లగడ్డలో ఐదేళ్లుగా నిద్రపోతున్న ఎమ్మెల్యే కావాలా? ఐదేళ్ల పాటు ప్రజలు ప్రశాంతంగా నిద్రపోయేలా పని చేసే ఎమ్మెల్యే కావాలా? అని అఖిలప్రియ మహిళలను ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, గుర్రప్ప, బాలచంద్రుడు, వెంకటరవి, నాగ లింగమయ్య, పెదరాయుడు, సూరా రామ, శ్రీనివాసులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'అరాచక పాలనకు అంతం తప్పదు'

చాగలమర్రి: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు అంతం తప్పదని ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని మద్దూరు, పెద్దబోదనం గ్రామాల్లో సోమవారం ఆళ్లగడ్డ జనసేన నాయకుడు ఇరిగెల రాంపుల్లారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదన్నారు. వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని, ఈ ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మి, నాయకులు వెంకటసుబ్బయ్య, ఓబన్న, అంజి, వెంకటేష్, మాబువలి, వీరయ్య, ఇమామ్‌వలి, శ్రీనివాసరెడ్డి, శేఖర్‌రెడ్డి, జమాల్‌రెడ్డి, ఓబులేసు, ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ గెలిస్తేనే బంగారు భవిష్యత్తు'

నంద్యాల, మే 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ గెలిస్తేనే ప్రజలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని, టీడీపీని గెలిపించాలని టీడీపీ నాయకుడు భార్గవ్ రామ్‌నాయుడు సోమవారం పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ మండలంలోని పెద్దకందుకూరు గ్రామానికి చెందిన సురేంద్ర, నవీన్, నాగేంద్ర, బాబుతో పాటు 20 కుటుంబాలు వైసీపీని వీడి ఆళ్లగడ్డ పట్టణంలోని అఖిలప్రియ నివాసంలో భార్గవ్‌రామ్‌నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు.

రుద్రవరం: వైసీపీ పతనం మొదలైంమైందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం తప్పదని టీడీపీ నాయకుడు భార్గవరామనాయుడు అన్నారు. ప్రజల చూపు టీడీపీ వైపే ఉందన్నారు. ఐదేళ్లలో వైసీపీ చేసినఅభివృద్ధి కంటే అవనీతి ఎక్కువగా ఉందని ఆరోపించారు.

టీడీపీలో చేరిక: ఆలమూరు గ్రామానికి చెందిన ఉయ్యాలవాడ మాబు నర్సిపల్లె రఫి, ఆసిఫ్‌తో పాటు పది కుటుంబాలు భార్గవరామ్‌నాయుడు సమక్షంలో టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో రాజ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని మందలూరు గ్రామానికి చెందిన నాగరాజు, పెద్దగురప్ప, బాలుడు, నాగన్న కొండయ్యలతోపాటు మరో 35 కుటుంబాల టీడీపీలో చేరాయి. భూమా నివాసంలో భార్గవరామ్‌నాయుడు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నంద్యాల రామశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

చాగలమర్రి: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్‌నాయుడు అన్నారు. మండలంలోని కలుగొట్లపల్లె గ్రామంలో వైసీపీ నాయకులు యేసయ్య, రవి, ప్రసాదు, సుధాకర్, దేవరాజుతో పాటు మరో 20 కుటుంబాలు సోమవారం భార్గవ్‌రామ్‌నాయుడు సమక్షంలో టీడీపీలో చేరాయి. టీడీపీ నాయకులు శివరామిరెడ్డి, జమాల్‌రెడ్డి, బాల దస్తగిరి, చిన్న దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే టీడీపీ లక్ష్యం

ఉయ్యాలవాడ: మహిళా సాధికారతే టీడీపీ లక్ష్యమని టీడీపీ నాయకుడు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి చెప్పారు. సోమవారం ఉయ్యాలవాడ గ్రామంలో మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసే పథకాల గురించి వివరించారు. అలాగే భూహక్కు చట్టాన్ని రద్దు చేస్తారని చెప్పారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా భూమా అఖిలప్రియను, ఎంపీగా బైరెడ్డి శబరిని భారీ మెజారిటీతో గెలిపించించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, నర్శిరెడ్డి, మాజీ ఎంపీటీసీ బోరెడ్డి పద్మావతి, నారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, మోహన్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, బాబుల్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. మండలంలోని చింతలచెరువు, కొలుములపేట, పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. టీడీపీ నాయకులు నర్సిరెడ్డి, నారాయణరెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, ఓబయ్య, నాగేంద్ర, షరీఫ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, నరేంద్రారెడ్డి, సంజీవరెడ్డి, నర్సిరెడ్డి, గురుశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగత్ విఖ్యాత్‌రెడ్డి

యువతకు 20 లక్షల ఉద్యోగాలు

డోన్, మే 6: వైసీపీ పాలనలో యువత భవిష్యత్ అంధకారంగా మారిందని టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే చంద్రబాబు లక్ష్యమని టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ధర్మవరం గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీకి నాయకులు అనుముల మధుసూదన్ రెడ్డి, శివశంకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మురళి మోహన్ రెడ్డి, మహేంద్రబాబుతో పాటు మరో 25 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధర్మవరం పెద్దనాగిరెడ్డి, చిన్న నాగిరెడ్డి, గౌతమ్ రెడ్డి, భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.